**కథ** -పులిపాక కనకదుర్గ

# చిన్నకోడలు

**"మా చిన్న కోడలు రాలుగాయి సుమా" ఫోన్‌లో వాపోయింది భాను మతి.**

**క్రితంసారి ఫోన్ చేసినప్పుడు కూడా పెద్దలంటే చిన్న కోడలికి అస్సలు లక్ష్యం లేదని నొచ్చుకుంది.**

**అంతకుముందు భాను పుట్టినరోజుని పురస్కరించుకుని నేను ఫోన్ చేసినప్పుడు కూడా చిన్న కోడలి ప్రవర్తనని తలుచుకుని మరీ బాధపడింది.**

**ఒకరకంగా భానూని కదిలించినప్పుడల్లా తన గోడు వెళ్లబోసుకోవడం పరిపాటయ్యింది. చెప్పొద్దూ నా ఆప్తమిత్రురాలిని ఇంతగా ఆరళ్లు పెడుతున్న ఆ పిల్లంటే పీకలదాకా కోపం ముంచుకొచ్చింది.**

హన్నా! పెళ్లయ్యి ఆర్నెల్లు కూడా కాలేదు. అప్పుడే అత్తగారిని లెక్కచేయటం లేదంటే ఎంత గడుగ్గాయి అయ్యుంటుందో ఊహించగలను.

అయినా అత్తగారు అమాయకురాలయితే కోడలిది కదా పెత్తనమంతా.

నిన్న కాక మొన్నే అయినట్టుంది భాను చిన్న కొడుకు పెళ్లి జరిగి.

అప్పుడే అత్తాకోడళ్లకు పడటం లేదు. ఈ విబేధాలే ముదిరితే వేరుకాపురం అంటారు. కుదరకపోతే విడాకులు. అయినా పెళ్లిలో ఎంత అమాయకంగా కనిపించింది.

భానూకు ఇద్దరు కొడుకులు. పెద్దాడికి పెళ్లయ్యి నాలుగేళ్లవుతోంది.

రెండోవాడి పెళ్లి అయ్యి ఆర్నెల్లు అవుతున్నట్టుంది.

చిన్నాడి పెళ్లి కుదరగానే భాను ముందర తనకే ఫోన్ చేసింది. ''అరుణా! సుందర్ పెళ్లి సెటిలయ్యింది. అందర్లా నువ్వు కూడా పెళ్లికి ఒక్కరోజు ముందో, లేదంటే అదే రోజో వస్తే కుదరదు. కనీసం పది రోజుల ముందు వచ్చి అన్నీ నువ్వే చూసుకోవాలి.''

స్నేహితురాలి పిలుపు మేరకు పది రోజుల ముందు కాకపోయినా, నాలుగు రోజుల ముందుగానే వాళ్ల ఇంటికి సకుటుంబంగా చేరుకున్నాం.

మమ్మల్ని చూడగానే భానుమతి ఆనందానికి అవధులు లేవు.

ఇహ సుందర్ అయితే పెళ్లికొడుకునన్న విషయమే మరిచిపోయి మాకు మర్యాదలు చేసేడు.

''ఏమయ్యా సుందర్, పెళ్లికొడుకువి. మర్యాదలు చేయించుకోవటం నీ హక్కు. అలాంటిది నువ్వు మాకు మర్యాదలు చేయటం ఏమీ బాగా లేదయ్యా'' నవ్వుతూనే అన్నాన్నేను.

''మన పని మనం చేసుకోవటానికి భేషజాలు దేనికాంటీ?'' వినమ్రంగా అన్నాడు సుందర్.

పెళ్లికొడుకు తనే అయినా అన్ని వ్యవహారాలు తనే దగ్గరుండి చూసుకుంటున్న సుందర్ దక్షతను చూస్తుంటే ముచ్చటేసింది.

కబుర్లాడుకుంటూ కాఫీ, ఫలహారాలు కానిచ్చేసరికి సాయంత్రం అయిదయ్యింది.

''అవునూ, దివ్యా, శ్రీధర్‌లు కనిపించటం లేదేంటి? బయట పనులన్నీ వాళ్లు చూసుకుంటున్నారా?'' వచ్చి ఇంతసేపయినా కనిపించని భాను పెద్దకొడుకుని, కోడలిని ఉద్దేశించి ప్రశ్నించేను.

లిప్తకాలం భానూ మొహం కళ తప్పింది.

''వాళ్లకేవో అత్యవసర పనులున్నాయట. వచ్చేస్తారు'' తడబాటుని కప్పిపుచ్చుకుంటూ బదులిచ్చింది భానుమతి.

ఇంట్లో శుభకార్యం జరుగుతూంటే బాధ్యతంతా తీసుకోవాల్సిన పెద్దకొడుక్కీ, కోడలికి మరేం రాచకార్యాలున్నాయో అర్థం కాలేదు. కానీ, ఆ మాటంటే భానుమతి మనసు కష్టపెట్టుకుంటుందేమోనని చెప్పలేదు.

ఎట్టకేలకు పెళ్లి మరో రెండు రోజులుందనగా సతీసమేతంగా వచ్చేడు శ్రీధర్.

శ్రీధర్ భార్య దివ్య దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి. తాహతుకు మించిన భేషజం కొట్టొచ్చినట్టు కనిపించింది. అందం కంటే అలంకరణ అతిగా ఉన్నట్టు ఇట్టే తెలిసిపోతోంది. అత్తమామల పట్ల కాసింతయినా ఆదరణ ఆమె ప్రవర్తనలో కనిపించలేదు.

అమాయకపు భానుమతి మటుకు కోడలు అసలు పెళ్లికి రావటమే మహద్భాగ్యం అన్నట్టూ కోడల్ని నెత్తిన పెట్టుకుని పూజిస్తోంది. ''భగవంతుడా! ఈ అమాయకురాలికి యోగ్యురాలయిన అమ్మాయిని చిన్నకోడలిగా చెయ్యి'' మనసారా దేముడిని ప్రార్థించటం తప్ప ఏం చెయ్యగలను?

సుందర్‌ని పెళ్లికొడుకుని చేశాము.

పెళ్లి రేపనగా వియ్యాలవారి ఊరికి బయలుదేరాము.

వియ్యాలవారి ఇల్లు చూడగానే అర్థమయ్యింది కలిగిన కుటుంబమని. విడిదింట్లో మర్యాదలు చవిచూసేక తెలిసొచ్చింది చాలా పద్ధతయిన మనుషులని. భానూకి రాబోయే కోడలు మంచి పద్ధతయిన అమ్మాయి అయ్యుంటుందని చిన్న ఆశ నాకు తెలియకుండానే కలిగింది.

కాశీ యాత్ర నుంచి ఎదురుకోలు వరకూ అన్ని మర్యాదలూ ఘనంగా జరిపించారు వియ్యాలవారు.

ఏ ఆటంకమూ లేకుండా పెళ్లి చక్కగా జరిగింది.

సుందర్ భార్య దీప చూడముచ్చటగా ఉంది. కలవారి అమ్మాయినన్న అహంగానీ, ఉద్యోగస్తురాలినన్న దర్పం కానీ ఆ అమ్మాయిలో మచ్చుకు కూడా కనిపించలేదు.

భానుమతి ఇంట్లో సత్యనారాయణస్వామి వ్రతం, రిసెప్షన్ అయిపోయాక మూడు నిద్దర్లకని నూతన వధూవరులు పెళ్లికూతురి తల్లిగారింటికి వెళ్లేరు.

దాదాపు బంధువులంతా వెళ్లిపోవటంతో ఇల్లంతా బోసిపోయినట్టయింది. రాత్రి

ట్రైన్‌కి రిజర్వేషన్ చేయించుకుని ఉండడం వల్ల మధ్యాహ్నం కాసేపు నడుమువాల్చేం. పెళ్లి పనుల తాలూకు అలసట వల్లేమో వెంటనే అందరికీ నిద్ర పట్టింది.

మెలకువ వచ్చేసరికి నాలుగయ్యింది.


భానూ గిన్నెలు తోముతుంటే, వాళ్లాయన కడిగి బోర్లిస్తున్న దృశ్యం కిటికీలోంచి కనిపించింది. ప్రొద్దున్న కూడా పనిమనిషి రాలేదన్న విషయం గుర్తుకొచ్చింది. భానూకు సాయం చేయకుండా మొద్దునిద్ర పోయినందుకు సిగ్గేసింది. ఆ సమయంలో వాళ్ల మధ్యకు వెళ్లటం బాగుండదని అలాగే పడుకుండిపోయేను. కాసేపయ్యేక టిఫిన్ చేయటంలో అయినా భానూకి హెల్ప్ చేద్దామని బయటకు వచ్చేను.

''పెళ్లి ఇల్లని కూడా చూడకుండా పనమ్మాయి ఈ రోజు రావటం మానేసింది. సమయానికి మా పెద్దకోడలు అన్ని పనులూ అందుకుంది కాబట్టి సరిపోయింది'' తడిచేతులు తుడుచుకుంటూ పక్కింటివారితో చెప్తోంది భానుమతి.

వచ్చిన దగ్గిర్నించి చిన్నమెత్తు సాయం చేయకుండా తమ గదికే పరిమితమయిపోయి, భోజనాలకి మాత్రమే బయటకు వచ్చే కోడలి తప్పులను కడుపులో దాచుకుంటున్న భానూని చూస్తుంటే అత్త కూడా అమ్మ కాగలదనిపించింది.

కన్నీటి తెరల నడుమ భాను రూపం మసకబారింది.

★ ★ ★



రెండు రోజులయ్యింది భానూ వాళ్లింటికి వచ్చి.

మనవరాలి పుట్టినరోజు ఫంక్షన్‌కు తప్పనిసరిగా రావాలంటూ అల్లుడూ, అమ్మాయి మరీమరీ పట్టుబట్టటంతో బెంగుళూర్ వెళ్లి వారం రోజులున్నాము.

చిన్నారి పాపాయి ఆటపాటలతో వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి.

పాపాయిని వదిలి వచ్చేస్తుంటే ఎంత దిగులుగా అనిపించిందో.

భానూని చూసి చాలా రోజులయ్యింది. ఎప్పట్నించో వాళ్లింటికి రమ్మనమని భానూ కూడా ఒకటే గొడవ. ఎలాగూ ఇంత దూరం వచ్చాంకదాని భానూ వాళ్లింట్లో కూడా నాలుగు రోజులు ఉండేలా తిరుగు ప్రయాణం ప్లాన్ చేసుకున్నాం.

మమ్మల్ని చూడగానే భానూ ఎంతగా సంతోషించిందీ విప్పారిన తన మొహమే చెప్పింది.

''ఇన్నాళ్లకు గుర్తొచ్చామా?'' ఓ చెంప సాదరంగా ఆహ్వానిస్తూనే మరో చెంప నిష్ఠూరమాడింది భాను.

''గుర్తురానిదెప్పుడు కానీ, రావటానికి మటుకు వీలు చిక్కింది ఇప్పుడే'' నవ్వుతూనే బదులిచ్చాను నేను.

ఆ సాయంత్రం అందరమూ బిర్లామందిర్‌కు వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నాము. అంతకు ముందు కూడా చాలాసార్లు ఆ గుడికెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్నాము. ఎన్నిసార్లు దర్శించుకున్నా అదే భక్తిపారవశ్యం కలగటం ఆ దేవాలయ మహత్యమేమో అనిపించింది.

మర్నాడు అందరమూ సరదాగా జూపార్క్‌కి వెళ్లేము.

ఎటొచ్చీ ఇక్కడి పరిస్థితే అయోమయంగా ఉంది.

దీప గురించి భానూ చెప్పినదానికి, ఇక్కడ నేను చూస్తున్నదానికి పొంతన లేదు. దీప ఎంతో చక్కగా మమ్మల్ని రిసీవ్ చేసుకుంది. రుచికరమైన కొత్త కొత్త వంటలు చేసి కొసరి కొసరి తినిపించింది. పెద్దల పట్ల తను కనబరుస్తున్న మర్యాదామన్ననలు చూస్తుంటే భానూ చెప్పింది దీప గురించేనా అన్న అనుమానం కలిగింది.

బంగారం లాంటి పిల్ల భానూకు ఎందుకు నచ్చటం లేదో అర్థం కాలేదు.

పోనీ భానూని తప్పు పడదామంటే తను ఎంత మంచి అత్తగారో నాకు తెలియంది

కాదు. మచ్చుకు కూడా సద్గుణాలు లేని పెద్ద కోడలి పట్ల తన ఔదార్యం నాకు తెలియంది కాదు. కాకపోతే వెతికి చూసినా లోపం ఎంచలేనంత కుదురుగా ఉన్న దీప తనకెందుకు నచ్చటం లేదో తెలియరావటం లేదు.

నిన్నటికి నిన్న దీప ఆఫీసులో ఏదో కాటన్ చీర కొనుక్కుందని కేకలేసింది. ఏ పనయినా చేసే ముందు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదంటూ రంకెలు వేసింది.

ఏమంత తప్పు చేసిందని దీపని అంతగా తప్పు పట్టాల్సిన అవసరం కలిగిందో నాకు ఓ పట్టాన అర్థం కాలేదు.

బిక్కమొహం వేసిన దీపని చూస్తుంటే జాలేసింది.

అంతెందుకు ప్రొద్దుట బ్రేక్‌ఫాస్ట్‌కని సుతిమెత్తని ఇడ్లీలు, వడ అందులోకి కొబ్బరిచట్నీ, సాంబారు తయారుచేస్తే ఎవరినడిగి చేశావంటూ క్లాస్ పీకింది.

పాపం దీపకు కన్నీళ్లు ఒక్కటే తక్కువ.

ఇక్కడకు రాకముందు దీపంటే ఎంతమాత్రమూ సదభిప్రాయం లేదు. ఇక్కడికొచ్చేక మటుకు భానూదే తప్పని అనిపిస్తోంది. కాకపోతే ఇన్నేళ్ల మా స్నేహం ఆ నిజాన్ని అంగీకరించనివ్వటం లేదు. కానీ, ఒకటి మటుకు నిజం. భానూ ఏదో వంకన దీపని సాధిస్తూనే ఉంది. సతాయిస్తూనే ఉంది. వచ్చిన దగ్గర్నించి నేను గమనించాను.

కాకపోతే తననెంతమాత్రమూ లెక్కచేయని పెద్దకోడలి పట్ల అంత ఆదరణ, ఒద్దికగా ఉండే చిన్నకోడలంటే వైరం కనబర్చాల్సిన అవసరం ఏమిటో భానూకే తెలియాలి. తన విచిత్ర వైఖరి నాకెంత మాత్రమూ అంతుబట్టలేదు.

ఆ మాటే ఆయనతో అన్నాను.

''ఇందులో అర్థం కానిదేముంది? మెత్తని వాళ్లని చూస్తే మొట్టబుద్దేస్తుంది. ఒద్దికగా ఉన్న దీపని చూసేసరికి పెత్తనం చేయాలన్న కోరిక అసంకల్పిత ప్రతీకార చర్యలా కలిగి ఉంటుంది. ఇహ పెద్దకోడలు విషయమంటావా, తను ఇక్కడుండదు. పైగా గడసరిది. అక్కడ మంచిగా ఉండటం తప్ప మీ ఫ్రెండ్‌కు వేరే గత్యంతరం లేదు.''

భానూ గురించి ఆయన ఎనాలిసిస్ వింటుంటేనే ఒళ్లు మండుకొచ్చింది.

''తను అలాంటిది కాదు'' పంతానికి అన్నాను.

''తమ్ముడు తనవాడయినా ధర్మం చెప్పమన్నారు. మీ స్నేహితురాలని వాస్తవం అంగీకరించకపోతే ఎలా? నిజాయితీపరులు, ఉత్తములు తారసపడినప్పుడు వారి నిజాయితీని లోకువ కట్టి ఆనక మూల్యాన్ని చెల్లించిన వైనాలు మనకు తెలియనివా? అంతెందుకు మన పొరుగున ఒకప్పుడు ఉన్న రామారావుగారి ఉదంతం అప్పుడే మర్చిపోయావా?''

రామారావుగారి విషయం గుర్తుకురాగానే మనసంతా చేదు తిన్నట్టయ్యింది.

ఆయన కొంతకాలం మా పక్కింట్లో కాపురం ఉన్నారు. గంపెడు సంసారం. చాలీచాలని ఆదాయంతో అవస్థలు పడుతూంటే చేతనయిన సాయం చేస్తుండేవారం. పిల్లల స్కూలు ఫీజులని, చేబదుళ్లని ఏదో రూపేణా మాకు కలిగినంతలో సాయం అందించేవాళ్లం. ఎందుకలా చేశారో ఇప్పటికీ అర్థం కాని విషయం అంది. మా పేరు చెప్పి, మేమివ్వమన్నామని మావారి పాత మిత్రుడి దగ్గర వెయ్యి రూపాయలు తెచ్చుకున్నాడు. ఆర్నెల్ల తరువాత అప్పిచ్చినాయన వచ్చి తన బాకీ తీర్చమని అడిగితే నివ్వెరపోవటం మా వంతయింది. అలా మా మధ్యన సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మాతో స్నేహం దెబ్బతిన్నందుకు ఆయన తరచు ఇబ్బందులకు గురయ్యేవారని తరువాత మాకు తెలిసింది.

''ఎందుకండి మంచిగా ఉండేవారితో మంచిగా ఉంటూ మంచితనపు పరిమళాన్ని ఆస్వాదించక, మంచికి చెడు చేసి కోరి కష్టాలకు కొనితెచ్చుకోవటం?''

''మంచితనం అనేది సంస్కారానికి నిదర్శనమే కానీ చేతకానితనం కాదు. మంచివారిని ఎవరో ఒకరు ఎప్పుడో ఒకసారి వంచించవచ్చు. అందరు అన్నిసార్లు వంచించలేరు. ఆ విజ్ఞత లోపించటం వల్లనే మనిషికి, మనిషికి మధ్యన అగాథం ఏర్పడుతోంది. సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఈ నిజాన్ని గ్రహించిన నాడు అంతా సుఖసీమ అవుతుంది.''

ఆయన మాటల్లో చాలా వాస్తవముందనిపించింది.

అవన్నీ బయట వ్యవహారాలు. కానీ భానూని మాకేం పట్టనట్టు వదిలేస్తే వ్యవహారం మరింత ముదురుతుందేమోనన్న భయం కలిగింది. ఇలాంటి విభేదాలు ముదిరి చిలికి చిలికి గాలివానయినట్టు సంసారాలు కూలిపోయేవరకు వెళ్లటం లేదూ. అయినా భానూ ఇలా ప్రవర్తించటమే నాకు వింతగా ఉన్నది.

''ఎందుకండీ కొంతమంది చేజేతులా రిలేషన్‌షిప్స్ స్పాయిల్ చేసుకుంటారు. ఒక్కోసారి ఆఫీసుల్లో కూడా అంతే బాగా పనిచేసేవాళ్లను పక్కకు పెట్టి సరిగ్గా పనిచేయనివాళ్లని హైలైట్ చేస్తారు. మీకు తెలిసి ఉంటుంది. మా పెద్దనాన్నగారు బాగా చూసుకునే పెద్దకోడల్ని కాదని, ఎన్నడూ లెక్కచేయని చిన్నకోడల్ని వెనకేసుకొచ్చేవారు. ఎందుకలా చేయటం. చెయ్యనివాళ్లు ఎలానూ చెయ్యరు. చేసేవాళ్లను ఎందుకు డీమోరలైజ్ చెయ్యటం?''

''అదంతా చిత్రమైన సైకాలజీ అరుణా. బుద్ధిగా చెప్పిన మాట వినేవాళ్లు ఉంటే ఇంకా ఇంకా చేయించుకోవాలని, అదుపులో ఉంచుకోవాలని అనిపిస్తుంది. కానీ, అవతలవారి సహనానికి కూడా హద్దుంటుందన్న విజ్ఞత ఉంటే వ్యవహారం ఎక్కువ దూరం వెళ్లకుండా చూడొచ్చు. నిజానికి

## నాజూకు పంజాబీ భామ

**భూమిక చావ్లా బోలెడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతోందిప్పుడు. కారణం ఏంటంటారా? ఆమెకి తాజాగా ఓ పంజాబీ సినిమాలో నటించే చాన్స్ వచ్చిందిట. ఎంతయినా మాతృభాషలో నటించడం అంటే ఎవరికైనా సంబరంగానే వుంటుంది కదండి. ఈ పంజాబీ భామగారిని 'మేడమ్! అస్సలేమాత్రం లావు కాకుండా మీరింత నాజూగ్గా కనిపిస్తారు కదా! ఆ గ్లామర్ రహస్యం ఏంటో చెబుతారా?' అని అడిగితే- 'ప్రత్యేకంగా ఏం లేదండీ' అంటుంది. రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజులు చేసుందిట. అలాగే ఫ్రెష్ ఫ్రూట్ జ్యూస్‌లు బాగా తాగుతుంది. అంతేనట.**



మనతో మంచిగా ఉండేవారితో మంచిగా ఉండటం వల్ల మరింత మంచి జరుగుతుంది. సిన్సియర్‌గా ఉండేవారిని అదుపులో ఉంచుకోవాలనుకోవటం అవివేకమే అవుతుంది. సహనం నశించిననాడు వారు కూడా ఎదురు తిరుగుతారు. అంతవరకూ రానివ్వకపోవటంలోనే ఉంది మన విజ్ఞత అంతా.''

''మీరన్నట్టుగా దీపకు కూడా సహనం నశించి పచ్చని సంసారం చెదిరిపోకముందే మనమే ఏదో ఒకటి చెయ్యాలి. అయినా చిన్నతనం వల్ల దీప ఏదయినా తప్పు చేస్తే సర్దుకుపోవాల్సింది పోయి ఈ వయసులో భానూ ఇలా ప్రవర్తించటం బాగోలేదు. ఇలాంటి అవివేకపు కుటుంబ రాజకీయాల వల్ల భాను ఏమీ సాధిద్దామనుకుంటుందో అర్థం కావటం లేదు'' దిగులుగా అన్నాను.

''సర్లే కుటుంబ రాజకీయాల వల్ల సంబంధాలు దెబ్బతినటం, సంసారాలు విచ్ఛిన్నమవ్వటం తప్ప ఏమీ ఒరగదని తెలియకపోవటం వల్లే కదా ఇన్ని ఫ్యామిలీ కోర్టులూ, గృహహింస చట్టం కూడా తీసుకురావాల్సి వచ్చింది. మనం వెళ్లేలోపు మీ స్నేహితురాలతో మాట్లాడి తనకి కౌన్సిలింగ్ చెయ్యాలి.''

''నేనా? భానూ నొచ్చుకుంటుందేమో నండి'' భయంగా అన్నాను.

''అరుణా, ఆపరేషన్ అవసరమైనప్పుడు కత్తులతో కోత పెట్టాల్సి వస్తుందని వెరిస్తే ప్రమాదకరం. కటువైనదయినా నిజాన్ని తెలియజేయాలి. తప్పును సరిదిద్దాలి'' భానూతో మాట్లాడక తప్పదన్నట్టు చెప్పారాయన.

ఓ మనిషి గురించి అంతా తెలుసు అనుకోవటం ఎంత తప్పు. భానూ గురించి నాకంతా తెలుసుననుకున్నాను. ఏమీ తెలియదని, మనిషిలో మరో మనిషి ఉండవచ్చని తెలిసొచ్చింది

★ ★ ★

దెబ్బతిన్నట్టుగా చూసింది భానుమతి.

''అంటే నేను గయ్యాళి అత్తను, పైపెచ్చు దీపను సతాయిస్తున్నానని నీ అభిప్రాయమా?'' నావంక తీవ్రంగా చూస్తూ అంది.

''భానూ అర్థం చేసుకోటానికి ప్రయత్నించు. పాపం దీప ఒరిమి కల పిల్ల. అణకువగా ఉంటుంది. చిన్నతనం వల్ల తనేమయినా తప్పు చేస్తే పెద్దమనసుతో క్షమించాలి. అంతేకానీ, నిష్కారణంగా ద్వేషం పెంచుకుంటే ఎవరికి సుఖం చెప్పు. సమస్య ముదరకూడదనే ఇదంతా చెప్పటం'' అనునయంగా అన్నాను.




''సమస్య ముదిరితే నష్టపోయేది దీపే'' నిర్లక్ష్యంగా అంది భాను.

'స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే అని ఆర్గ్యూ చేసే భామయేనా ఇలా మాట్లాడుతుంది' ఆశ్చర్యంగా అనిపించింది.

''పొరపాటు భానూ. వివాహం అనేది స్త్రీకి ఎంత ముఖ్యమో, మగవాడికి అంతే అవసరం. సమస్య ముదిరితే దీపతో పాటు సుందర్ కూడా నష్టపోతాడు. దీప మనసు విరిగిపోయి, సహనం కోల్పోకముందే తప్పు దిద్దుకో. సుందర్‌కు విషయం తెలిసి వేరు కాపురం పెట్టకముందే మేలుకోవటం మంచిది.''

''సుందర్ నేను గీచిన గీటు దాటడు. అంతగా ఉండలేకపోతే దీపే ఇల్లు విడిచి వెళ్లాల్సి ఉంటుంది'' అతిశయంగా అంది భానుమతి.

''ఒకవేళ దీప అలా వెళ్లిపోతే సుందర్‌కు తిరిగి మంచి సంబంధం వస్తుందా? ఎవరయినా ఫర్వాలేదని నువ్వు ఎఙ్జ్ఞస్టయినా వచ్చే అమ్మాయికి మీ సంగతి తెలిసిన తరువాత మిమ్మల్ని గౌరవించగలుగుతుందా? ఆదరిస్తుందా? దానికి బదులుగా దీపతో మంచిగా ఉండటమే తెలివయిన పని కదా'' నచ్చచెప్పేను.

''నీ వరస చూస్తుంటే అత్తలదే తప్పంతా అనేట్టున్నావు? కోడళ్లది తప్పుండదా? ఎందుకు దీప మీద ఉన్నట్టుండి అంత ప్రేమ పుట్టుకొచ్చింది?'' వెటకారంగా అంది భానుమతి.

తప్పు దిద్దుకొమ్మనమని హితవు చెప్తుంటే మొండిగా ఏదోవిధంగా దీపదే తప్పని ప్రూవ్ చెయ్యాలన్న భానూ ప్రయత్నాన్ని చూస్తుంటే చిరాకేసింది.

''భానూ కోడళ్లది తప్పుండదా అన్నావు. ఎందుకుండదు ఉంటుంది. గుర్తుందా. మీ అత్తగారికి నువ్వు పెళ్లయిన తరువాత కూడా చదువు కంటిన్యూ చేయటం ఇష్టం లేదు. కానీ, నీ ఇష్ట ప్రకారమే నువ్వు చదువుకున్నావు, ఉద్యోగం కూడా సంపాదించుకున్నావు. చివరకి, ఆవిడకు సుస్తీ చేసినప్పుడు నాలుగు రోజుల సెలవు కూడా పెట్టలేకపోయావు. ఇప్పుడు చెప్పు ఒక కోడలిగా నువ్వు తప్పు చెయ్యలేదా? అంతెందుకు నిర్లక్ష్యం ప్రదర్శించే నీ పెద్ద కోడల్ని కనీసం మందలించగలవా? నీకు ఒక న్యాయం, నీ చిన్నకోడలికి ఒక న్యాయమా? మంచి పిల్లను సమర్థించగానే ఏదోవిధంగా దీపని చెడుగా చిత్రీకరించాలని చూడకు. భానూ చిన్నతనం వల్ల దీప ఏదయినా తప్పు చేస్తే సరిదిద్దడానికి ప్రయత్నించు. వినకపోతే, మీ అత్తగారు నిన్ను, నువ్వు నీ పెద్దకోడల్ని పెద్ద మనసుతో ఎలా క్షమించారో అలా క్షమించు. భానూ మంచి అత్తగార్లు కూడా చాలామందే ఉన్నారు. ఉన్నారు కాబట్టే నువ్వూ, నేనూ, నీ పెద్దకోడలు పచ్చగా ఉన్నాం. దీపని కూడా అలా పచ్చగా ఉండనిద్దాం'' కఠినంగా అన్నాను.

నా మాటల్లో నిజాలకు భానూ బిత్తరపోయింది.

ఇనుము వేడిగా ఉన్నప్పుడే వంచాలని అర్థమయ్యింది.

''భానూ, ఇప్పటికే నిరుపయోగమైన కుటుంబ కలహాల వల్ల, రాజకీయాల వల్ల వివాహ వ్యవస్థలో బీటలు వస్తున్నాయి. వాటిని మనం పెద్దవి చెయ్యొద్దు. మంచి ఏ రూపంలో కనిపించినా దాన్ని మనం ఎంకరేజ్ చేద్దాం. మంచిగా ఉండే చిన్నకోడలు లాంటి వారిని సతాయించి మనకు మనమే మంచి అన్నది లేకుండా చేసుకోవద్దు.''

చిన్నబోయిన భానుమతి మొహం చూడగానే జాలేసింది.

కత్తి గాటుకు వెరచి శస్త్ర చికిత్స మానుకుంటే జబ్బు ముదిరి దేహం కుళ్లిపోతుంది. నిజం నొప్పించినా మంచినే చేస్తుంది.

మార్పు ఓవర్‌నైట్ అసంభవం.

కానీ మంచి మార్పు దిశగా, ఓ చిన్న ఆలోచన చాలు, ట్రాన్స్‌ఫర్మేషన్‌కు నాంది పలకటానికి. మౌనంగా ఉండిపోయిన భానూలో నాకా చిన్ని ఆలోచనే కనిపించింది.

☆